క్లుప్తంగా

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం..

సత్తుపల్లి: వర్షం కారణంగా.. బుధవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో 20వేల టన్నులు, కిష్టారం ఓసీలో 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, జేవీఆర్ ఓసీలో 1.40లక్షల క్యూబిక్‌మీటర్లు, కిష్టారం ఓసీలో 50వేల క్యూబిక్‌మీటర్ల ఓబీ పనులకు అంతరాయం ఏర్పడినట్లు పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావులు తెలిపారు.

రహదారి మరమ్మతులు



గుంతలను పూడ్చుతున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని బుధవారం వరంగల్ ఆర్‌ఎండీఏ శాహిద్ మసూద్ పర్యవేక్షించారు. వైరా రింగ్‌రోడ్డు సెంటర్ వర్షానికి రోడ్డుపై గుంతలు ఏర్పడంతో వాటిని పూడ్చించారు. అలాగే 6వ వార్డు, లాలాపురంలో సైడ్ డ్రెయిన్లలో పేరుకుపోయిన మురుగును జేసీబీతో తొలగించే పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, మున్సిపల్ ఏఈ శంకర్, మున్సిపల్ ఆర్ఐ ప్రదీప్, శానిటైజర్ ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి కాలనీ వాసులు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు, అధికారులు

వేంసూరు: మండలంలోని ఎర్రగుంటపాడు పంచాయతీలోని ఎస్టీ కాలనీలో బుధవారం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరడంతో తహసీల్దార్ ఎంఏ రాజు కాలనీని పరిశీలించారు. కాలనీ వాసులకు వేంసూరు హాస్టల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి.. భోజనంతో పాటు వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్, ఆర్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

నాసిరకంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం



రైల్వే అండర్ బ్రిడ్జి సైడ్‌వాల్స్ నుంచి నీరు కారుతున్న దృశ్యం

మధిరరూరల్: మండల పరిధిలోని దెందుకూరు గ్రామం వద్ద ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నాసిరకంగా ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జి సైడ్ వాల్స్ నుంచి బ్రిడ్జి గ్రౌండ్‌లోకి నీరు కారుతుంది. ఈ అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో నీరు నిల్వ ఉండి ప్రయాణికులు, రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్‌పై రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

సత్తుపల్లిటౌన్: నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తునందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం ఆమె అధికారులకు ఫోన్‌చేసి వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు, వంకలు వరద నీరు ప్రవహించటం వల్ల ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పరిశుభ్రత పాటించండి..

సత్తుపల్లిటౌన్: ఈ వర్షాకాలం సీజన్‌లో దోమలు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిబాబు అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్తుపల్లి మున్సిపాలిటీలోని అన్ని వీధుల్లో దోమల నియంత్రణ చర్యలు, పరిశుభ్రతలపై విస్తృతంగా ఫ్లెక్సీలతో అవగాహన బోర్డులు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

తల్లాడ: మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ దేశభక్తి, స్వాతంత్ర్య పోరాటం వంటి అంశాలపై పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో బోర్డింగ్ ఫాదర్ జోసఫ్, ఫాదర్ రవి, సిస్టర్లు కిరణ్, కమల, బ్రదర్ హృదయరాజ్ పాల్గొన్నారు.

రోజంతా వర్షం..

- పొంగిన వాగులు.. వంకలు
- నిలిచిన రాకపోకలు
- నీటమునిగిన పంట పొలాలు
- స్తంభించిన జనజీవనం



సత్తుపల్లి: సదాశివునిపాలెం - భీమవరం రహదారి మధ్యలో ప్రవహిస్తున్న వరదనీరు

ఆకాశానికి చిల్లుపడినట్లు రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేక జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు గ్రామాల్లోని లో లెవల్ వంతెనలపై భారీనీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాలన్నీ వరద నీటితో మునిగిపోయాయి. గ్రామాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ క్రమంలో పలువురు అధికారులు వాగులను పరిశీలించి.. వరద తగ్గేవరకు బయటకు రావొద్దని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్



కల్లూరురూరల్: ఊటవాగు పొంగటంతో నీట మునిగిన వరిపొలాలు



వేంసూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పవాగు



వేంసూరు: రోడ్డుపై ప్రవహిస్తున్న కట్లేరు వాగు



వైరారూరల్: పత్తి పంటలో చేరిన వర్షపు నీరు



కల్లూరు పెద్ద చెరువు వద్ద అలుగును పరిశీలిస్తున్న అధికారులు



కల్లూరురూరల్: ఎంవీ పాలెం - అక్కపాలెం మధ్యలో..



వైరారూరల్: సిరిపురంలో..



తల్లాడ: బిల్లుపాడు-రామచంద్రాపురం వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్



సత్తుపల్లి: సత్తుపల్లి-కిష్టారం జాతీయ రహదారిపై నిలిచిన వరద



కారేపల్లి: అలుగుపోస్తున్న కారేపల్లి పెద్దచెరువు

భారీ వర్షానికి కూలిన ఇల్లు



కొత్తబోడిమెళ్లలో వర్షానికి కూలిపోయిన ఇల్లు

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీలోని కొత్తబోడిమెళ్లలో ఎడతెరిపిలేని వర్షానికి ప్రతాపరెడ్డికి చెందిన గృహం బుధవారం కుప్పకూలింది. ఈ సమయంలో కుంటుంబ సభ్యులు బయట ఉండడంతో ప్రమాదం తప్పింది. కానీ ఇంట్లోని దుస్తులు, ఆహార పదార్థాలన్నీ పాడైపోయాయి. దీంతో రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

ముదిగొండలో 11.4మి.మీ వర్షపాతం నమోదు



ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో గుంతలు పడిన దృశ్యం

ముదిగొండ: ముదిగొండలో బుధవారం 11.4 మి.మీ వర్షపాతం కురిసింది. వర్షానికి ఖమ్మం -కోదాడ ప్రధాన రహదారిలో పారిశ్రామిక ప్రాంతంలో రహదారిపై ఉన్న పలు గంతల్లో వర్షపు నీరు చేరడంతో.. స్థానికులు ఓ పెట్టను ఏర్పాటు చేసి, దానిపై టవల్ కప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారులను పలు మార్లు గుంతలను పూడ్చాలని కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట



అవగాహన కల్పిస్తున్న అధికారులు అనురాధ, అనూష

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం రెవెన్యూ గ్రామంలో బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర ఏడీఈ అనురాధ, స్థానిక ఏఈఈ అనూషలు మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఓవర్ లోడ్‌తో కాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ చీనా, లైన్ ఇన్‌స్పెక్టర్ మౌలానా తదితరులు ఉన్నారు.

ఏఈఈ ఉద్యోగానికి ప్రొద్దుటూరు యువతి ఎంపిక



గుర్రం శ్రీమన్య

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గుర్రం శ్రీమన్య పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి కాలరీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తుంది. దీంతో యువకుడిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

పాలడుగు యువకుడు..



మోదుగు ఉపేంద్ర

వెరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన మోదుగు ఉపేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభతో మిషన్ భగీరథ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఉద్యోగం సాధించారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన మువ్వా

సత్తుపల్లిటౌన్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసి మైత్రి రెస్టారెంట్‌ను బుధవారం రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అదే విధంగా రెస్టారెంట్‌లోని కౌంటర్లను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మట్టా ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

ఎర్రుపాలెం: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికై బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలపరిషత్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ భాగం వేణుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు దంతాల నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే.. నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8న జరగనున్న సమ్మెలో భాగంగా పారిశుద్ధ్యం, అత్యవసర సేవలు విద్యుత్, మంచినీటి సరఫరాలను నిలిపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు, గోపాలరావు, రవీంద్రబాబు, రామకృష్ణ, నాగేశ్వరరావు, రామచంద్రరావు, జమలయ్య, రితీష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

హన్షిక్‌కు సన్మానం



హన్షిక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: కొర్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి చాట్ల హన్షిక్ ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో సీటు సాధించిన సందర్భంగా బుధవారం జిల్లా యువజన క్రీడాధికారి తుంబురు సునీల్‌రెడ్డి విద్యార్థిని మినీ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పీఈటీ పసుపులేటి వీర రాఘవయ్యను అభినందించారు. కార్యక్రమంలో కొర్లగూడెం హెచ్‌ఎం అమర్లపూడి చక్రవర్తి, ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సండ్రను సన్మానించిన మాజీ ఎంపీటీసీలు..

తల్లాడ: మండలంలోని పలువురు మాజీ ఎంపీటీసీలు బుధవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి క్యాంప్ కార్యాలయానికి బిల్లుపాడు, మిట్టపల్లి, నూతనకల్ ఎంపీటీసీలు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెంకటవీరయ్యను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రుద్రాక్షబ్రహ్మం, మోహన్, కనకయ్య పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న గోపినాథ్

ముదిగొండ: మండలపరిధిలోని వల్లభిలో తపాలాశాఖ పథకాలపై బుధవారం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ.. తపాలాశాఖ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, బీమా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మరళీకృష్ణ, ఎంటీఎస్‌లు పెరుగు నాగేశ్వరరావు, లక్ష్మణ్, బీపీఎంలు, ఏబీపీఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో ఉచిత వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్: మండలంలోని చెరుకుపల్లి ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో బుధవారం సింగరేణి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సింగరేణి పీఓ ఎంవీ నర్సింహారావు, డాక్టర్ శిరీష, పంచాయతీ కార్యదర్శి దీప్తి, జగదీష్, నగేష్, ఉషా, ఆశీర్వాదం, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

వైరా: కొత్త రేషన్‌కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలపై సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నేడు 8న ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

బోనకల్: మండలంలోని పెద్దబీరవల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం యనమద్ది రాధ సహకారంతో 7,500 విలువచేసే నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు గ్రామ సొసైటీ అధ్యక్షుడు చింతలచెర్వు కోటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. హెచ్‌ఎం శారద, మాజీ సర్పంచ్ పున్నమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



వేంసూరు: భీరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వేంసూరు: మండల పరిధిలోని కొండెగట్ల, భీరపల్లిలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశేష్టతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ భవని మాట్లాడుతూ.. తల్లిపాలు పిల్లలకు రోగనిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు.

రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో..

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సిబ్బంది తల్లిపాల ముగింపు వారోత్సవాలను నిర్వహించారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శివమ్మ, సూపర్‌వైజర్ సత్యావతి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవిదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళి, ఏఎన్‌ఎం సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు అనిత, ధమావతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

తల్లాడ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని అంగన్‌వాడీ టీచ్చర్ కట్టా నిర్మలా అన్నారు. బుధవారం మండలంలోని కుర్నవల్లి బీసీ కాలనీలోని అంగన్‌వాడీ 3వ కేంద్రంలో గర్భిణులకు సీమంత వేడుకలు నిర్వహించారు. ప్రతీ నెలలో గర్భవతి అయిన వారు నాలుగు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, గుడ్డు తోపాటు భోజనం చేయాలన్నారు. ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, జయమ్మ, ఫకీరమ్మ, ఎన్.రాజేశ్వరి, శివపార్వతి, రాజ్యలక్ష్మి, నాగమణి, లీలావతి, రజిని, కృష్ణవేణి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చింతకాని: నాగులవంచలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన రూ. 3.14 లక్షల చెక్కులను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎంఆర్‌ఎఫ్ పంపిణీ చేశారు. నాగులవంచ గ్రామానికి చెందిన కాసాని తిరుమలి, కందిమళ్ల నాగేశ్వరరావు, చిర్ర ఉమ, జంగిలి వెంకటలక్ష్మి, మల్లెల త్రివేణి, జిలుగు అప్పమ్మ, చిన్నమండవ గ్రామానికి చెందిన పర్సగాని వెంకటేశ్వర్లుకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బస్వయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, నాగయ్య, చిన్నప్ప, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపాడు గ్రామంలో..

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బుధవారం పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. మందడపు అఖిలాండేశ్వరికి 60వేలు, మరీదు శిరీషకు 27,500, మర్రి నరసింహారావుకు 29వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాపారావు, వెంకటస్వామి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రూ.50 లక్షల రుణమాఫీ చెక్కులను రైతులకు పంపిణీ చేయటం జరిగింది. కార్యక్రమంలో కొర్లగూడెం మాజీ సర్పంచ్ నర్సింహారావు, నారాయణపురం మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సిద్ధు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

మధిర/ఎర్రుపాలెం/కల్లూరు: మధిర పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కానిస్టేబుల్ పోతురాజు వెంకటకృష్ణ(35) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన వెంకటకృష్ణ గతంలో మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. ఆయన ప్రస్తుతం కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. మధిర టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2009 బ్యాచ్‌కి చెందిన వెంకటకృష్ణ మృతదేహాన్ని అతని బ్యాచ్ పోలీసులతో పాటు పలువురు సందర్శించి నివాళి అర్పించారు.

జక్కంపూడి దంపతులకు మంత్రి తుమ్మల నివాళి



జక్కంపూడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన జక్కంపూడి కృష్ణ మూర్తి, ప్రేమలత దంపతుల చిత్రపటాలకు బుధవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జక్కంపూడి దంపతుల సేవలు చిరస్మరణీయమన్నారు. అలాగే నూతనకల్‌లో తూము రంగమ్మ చిత్రపటానికి నామా, సండ్రలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, నాయకులు వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, ప్రసాద్, రాజేష్, కృష్ణప్రసాద్, వీరారెడ్డి, బుద్దిసాగర్, శరత్, బాబు, రామప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పరామర్శ..

కారేపల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గాదెపాడు ఎంపీటీసీ సభ్యురాలు భూక్యా సోని భర్త జామ్లానాయక్ ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం ఇంటికి వచ్చారు. కాగా.. బుధవారం కాంగ్రెస్ నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, ఉపేందర్, శ్రీను పరామర్శించారు. ఈ సందర్భంగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాచారం అందించగా, మంత్రి పొంగులేటి ఫోన్లో జామ్లానాయక్‌తో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

పూనెం రాజుకు ఎమ్మెల్యే నివాళి..

కారేపల్లి: ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పూనెం రాజును.. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పరామర్శించారు. రాజు స్వగ్రామమైన ముత్యాలగూడెంకి వెళ్లి రాజు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అదే విధంగా విశ్వనాథపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తోటకూరి రాంబాబు తండ్రి నాగేశ్వరరావు మృతిచెందగా.. ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, రామ్మూర్తి, ఉమాశంకర్, తిరుపతిరావు, వీరప్రతాప్, అలీ, వినోద్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే యువతకు భవిష్యత్



మాట్లాడుతున్న బాబురావు

ఎర్రుపాలెం: కాంగ్రెస్ పార్టీలోనే యువతకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు బొబ్బిళ్లపాటి బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని ఇనగాలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న పార్టీ జిల్లా యూత్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి మండలానికి చెందిన వేజెండ్ల సాయికుమార్ పోటీ చేస్తున్నారని, యువత సాయికి మద్దతు పలికి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగే కాంగ్రెస్ పార్టీ యువజన ఎన్నికల్లో సాయికుమార్‌కు ఆన్‌లైన్ ఓటింగ్ జరుగుతుందన్నారు. జిల్లా మంత్రుల సహకారం, ఆశీస్సులతో పోటీ చేస్తున్న వేజెండ్ల సాయికుమార్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రమేష్, ప్రవీణ్, ప్రేమ్ కుమార్, సుధీర్, అజిత్, రాజా, పిచ్చయ్య, సురేష్ పాల్గొన్నారు.

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు బండి సోమకాంతమ్మ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం రోడ్డుపై ధర్నా నిర్వహించి.. విద్యార్థుల సమస్యలను జిల్లా డీఐఈఓ రవిబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రవిబాబు సత్తుపల్లి ప్రభుత్వం కళాశాల నుంచి అధ్యాపకులను డిప్యూటేషన్‌పై పంపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు శృతి, మౌనిక, ఏసుమణి, సిద్ధు, దిలీప్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.